# లోభత్వపు నీడల్లో...

రోషన్

ఆ రోజు మొదటి తేదీ! సాయంత్రం నాలు గున్నర నుంచి భర్త కోసం ఎదురు చూస్తూ ఉంది శ్యామల.

ఏమైనాసరే, ఈ నెల జీతంలోంచి బాబుకి రెండు జతల మంచి గుడ్డలు తియ్యాలి అనుకుంది. అప్రయత్నంగానే తన చీర వైపు చూసుకుంది. నేత చీర చిరగలేదు కాని, బాగా రంగు వెలిసిపోయి ఉంది. తనూ ఒక చీర అడిగితేనో...?! ఆ ఆలోచన వచ్చిందే తడవుగా మెదడును అదుపులో పెట్టేసింది. ఇప్పుడు తనకు చీరలు లేకపోతేనేమిటి...? తననూ, తనచీరనూ ఎవరు చూడొచ్చారు?... బాబు స్కూలుకు వెడతాడు. వాడి తోటి పిల్లలు స్కూలు డ్రెస్సు అయినా మంచి మంచి బట్టలు వేసుకొని వస్తారు. మరి బాబో...!

ఆ రోజు ప్రొద్దున జరిగిన సంఘటన కళ్ళముందు స్పష్టంగా కనిపించింది.

స్కూలుకు టైమయిపోతూంటే గబ గబా ముందు రోజు రాత్రి ఉతికి ఆరేసిన తెల్ల షాక్సా, బ్లూ నిక్కరు తీసుకొచ్చి మంచంమీద వేసింది.

టిఫిన్ తింటున్న బాబు చటుక్కున వదిలేసి వచ్చి ఒకసారిగా ఆ బట్టల్ని తీసుకొని ముందు గదిలోకి పడేటట్లుగా గిరాటేశాడు. ఎప్పుడూ లేనిది బాబు ప్రవర్తనకు తను కొద్దిగా ఆశ్చర్యపోయింది.

"ఏమిట్రా?... ఏమయింది?" అంది అప్రయత్నంగానే, ముందు గదిలోకి వెళ్ళి క్రింద పడ్డ స్కూలు డ్రెస్సును చేతిలోకి తీసుకుంటూ.

"నే నింక స్కూలుకు పోను!"

"అదేం?" ఇంకా ఆశ్చర్యపోయింది.

"అదంతే!... నే నింక చదవను."

అంతవరకు ఆశ్చర్యపోతున్న శ్యామలకు కోపం వచ్చేసింది. సాధారణంగా శ్యామలకు కోపం రావడం చాలా అరుదు.

తల్లి కోపగించుకునేసరికి కొంచెం తగ్గాడు బాబు. ఆ స్థానే కన్నీళ్ళొచ్చాయి. ఏడ్వటం మొదలు పెట్టాడు.

"ఏం?... స్కూలుకు పోక, చదువుకోక ఏం చేస్తావు?" కాస్త గొంతు హెచ్చించి బిగ్గరగా అరిచింది.

"నీకు...నీకు తెలియదు. ఆ డ్రెస్సు చూడు! దాన్ని చూసి మా ఫ్రెండ్సందరూ ఎలా గేలి చేస్తున్నారో తెలుసా?"

బాబు నోటి నుంచి ఆ మాటలు రాకముందే తల్లిగా తను వాడి అవసరాలు గుర్తించి అన్నీ అమర్చి పెట్టడం తన బాధ్యత. కాని, తను ఎంత నిస్సహాయురాలో బాబుకి తెలియదూ?!...

అయినా, చిన్నగా నవ్వేసి ప్రేమగా బాబుని దగ్గరకు తీసుకుంది.

"చూడరా, కన్నా! ఈ రోజుకి ఎలాగో ఇవి వేసుకుని వెళ్ళు. ఈ రోజు మొదటి తేదీ కదా! నాన్నగారు జీతం తెస్తూనే వెళ్ళి అడిగేసెయ్—'నాన్నా! నాకు స్కూలు డ్రెస్సు కావా'లని. అప్పుడు నాన్నగారు తెచ్చిచ్చేస్తారు."

నమ్మ శక్యం కానట్టు కళ్ళు ఇంతింత పెద్దగా చేసుకొని తల్లి కళ్ళలోకి చూశాడు బాబు.

తను అడగడం, నాన్నగారు నవ్వుతూ తెచ్చియ్యడం అమ్మ చెప్పినంత సులువుగా జరిగే పనేనా? ! అన్నట్లు ఉన్నాయి వాడి చూపులు.

శ్యామలకూ తెలుసు—అది అంత సులభ సాధ్యం కాని విషయమని.

మౌనంగా తల దించుకుంది.

"ఊహుఁ నేనుఅడగను. అడిగినా, నాన్న కోప్పడతాడే కానీ కుట్టించడు. నువ్వే ఎలాగో ఒక లాగ నాన్న నడిగి నాకు బట్టలు కుట్టించాలి."

చేతిలో ఉన్న డ్రెస్సును పరిశీలనగా చూసిన శ్యామలకు క్షణంసేపు ఏం మాట్లాడాలో తెలియలేదు. నిజమే! బ్లూ నిక్కరు—కాటన్‌ది—.రంగు వెలిసిపోయి, అది బ్లూ నిక్కరు—అనడానికి నిదర్శనంగా అక్కడక్కడా బ్లూ రంగు మాత్రం అస్పష్టంగా కనిపిస్తూంది. మధ్యలో కుట్ల దగ్గర పోతే తనే రెండు సార్లు సూదితో కుట్టిన గుర్తులు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. తెల్లటి షర్టు పాలియస్టర్‌దే! ఎంత పాలియస్టరైన రోజూ ఉతికి ఆరవేస్తూ ఉంటే పాలనురుగలాంటి తెల్లటి రంగు ఒక విధమైన మడ్డి రంగులోకి వచ్చేసింది. అదే డ్రెస్సుతో బాబు రెండు క్లాసులు పాస్ అయిపోయాడు. కొత్తగా కుట్టించినప్పుడు కాస్త పొడుగ్గానే ఉన్నా, సంవత్సరం పూర్తయ్యేసరికి కరెక్టు సైజుకు వచ్చినా ఇప్పుడు మాత్రం చాలా పొట్టివై పోయాయి. బాబు ఇప్పుడు ఆ డ్రెస్సు వేసుకుంటే ఎవరిదో చిన్నపిల్లాడి షర్టు వేసుకున్నట్లుగా ఉంటుంది.

ఆ మాత్రం బాబు కన్వెషన్ ఇచ్చినందుకు సంబర పడిపోయింది శ్యామల. బాబు ఇప్పుడు స్కూలుకు వెడితే అంతే చాలు! లేకపోతే డ్రెస్సు కారణంగా బాబు స్కూలు కెళ్ళలేదని తెలిస్తే మళ్ళీ అదో యుద్ధం. మొదటికే మోసం వచ్చినా వస్తుంది. అక్కణ్ణుంచి ఒక పెద్ద ఉపన్యాసం వినాల్సి వస్తుంది, ఇష్టం లేకపోయినా.

దాని సారాంశం—పరిస్థితులు ఎలా ఉన్నా పిల్లలు సర్దుకు పోయేటట్లు పెంచాలి అన్నది. చివరకు వాళ్ళకు 'పావర్టీ' అంటే ఏమిటో తెలిసి రావాలనే తను ఇలా చేస్తున్నాడని నచ్చ చెప్పే ధోరణిలో చెబుతాడు రామ్మూర్తి. కానీ, అది నూటికి నూరుపాళ్ళా నిజం కాదని ఇద్దరికీ, ఆ మాట కొస్తే బాబుకూ తెలుసు. పెళ్ళయిన ఈ పదేళ్ళలో అతణ్ణి మార్చలేనని పూర్తిగా తెలిసిపోయింది శ్యామలకు. పుట్టుకతో వచ్చిన బుద్ధి...మరి పోదట. ఆనాలోచితంగా ఆ ఆలోచన వచ్చినందుకు భర్త గుణగణాలంటే ఎంత ఇష్టం లేకపోయినా, గబగబా లెంపలు వాయించుకుంది. తను అతడి భార్య! భరించాలి. కాబట్టి ఇష్టం లేకపోయినా, అతడి మనస్తత్వాన్ని అర్థం చేసుకుని గుట్టుగా మసులుకుంటూంది. కానీ, బాబు? వాడి కింకా లోకం తెలియదు. తండ్రి మనస్తత్త్వం అర్థం అవుతున్నా, అప్పుడప్పుడు ఇలా పేచీ పెడుతూనే ఉంటాడు.

గునుస్తూనే అదే డ్రెస్సు వేసుకుని స్కూలు కెళ్ళి పోయాడు బాబు. వా డలా వెళ్ళపోగానే ఏదో పెద్ద భారం దిగిపోయినట్లుగా నిట్టూర్చింది శ్యామల.

కానీ, క్షణాల మీదే ఏమిటో అసంతృప్తి మన సంతా వ్యాపించి పోయింది.

ఇలా...ఇలా జీవితం ఇంకా ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు?

తను మరీ బీద ఇంట్లో పుట్టలేదు, బీదరికం అనుభవించిన దాన్ని కదా అని సరిపెట్టుకు పోవడానికి. మరీ ధనవంతుల ఇంట్లో కాకపోయినా, ఇంట్లో ఏ మాత్రం కష్టం లేకుండా జరిగి పోయే ఇంట్లోనే పుట్టింది. ఉన్నంతలో మంచి సంబంధమే చేశాడు తండ్రి. పది వేలు కట్నం ఇచ్చి, పది తులాల బంగారం పెట్టి సూపర్‌వైజర్ పోస్టులో ఉన్న రామ్మూర్తికి ఇచ్చి పెళ్ళిలో అతడి ఉద్యోగాన్నీ, హోదానీ, రూపాన్నీ, అతని వెనక ఉన్న ఇంటి పరిస్థితులనూ చూశాడే కానీ, అతనిలో గుప్తంగా దాగి ఉన్న గుణాలను మాత్రం చూడలేక పోయాడు. పెళ్ళవక ముందు అతను బయట ఒక సిగరెట్టు కానీ, ఒక కప్పు కాఫీ కానీ తాగకపోతే అది అతని మంచి లక్షణం అనుకుని, తన బిడ్డ మహా సుఖపడి పోతుందని సంబరపడి పోయాడే కానీ, అది లక్షణాల్లో కెల్ల అతి భయంకరమైన లక్షణం లోభత్వం అని తెలుసుకోలేకపోయాడు.


పెళ్ళిలో తనకు ఎడా పెడా అనవసరపు ఖర్చు పెట్టకుండా—"అదంతా అమ్మాయి పేర బాంకులో వెయ్యండీ!" అంటే అది అతని నిరాడంబరత్వం అనుకున్నారే కానీ, మరీ పీనాసితనం అనుకోలేదు.

ఇంటి బయటున్నా పిల్లికి బిచ్చం పెట్టకపోతే మానె, కనీసం కట్టుకున్న ఇల్లాలికి, కన్న కొడుక్కు కడుపు నిండా తిండీ, ఒంటి నిండా బట్టా ఇవ్వకపోతే ఎలా?

ఏదో బ్రతకాలి. కాబట్టి ఇంత తిండీ, ఒళ్ళు కనిపించకుండా కట్టుకోవాలి కాబట్టి ఒక రెండు జతల గుడ్డలుంటే చాలా?

డబ్బు లేకా, గతి లేకపోతే ఏ బాధా లేదు. కానీ, సంఘంలో గౌరవ మున్న వ్యక్తి భార్యా బిడ్డలుగా, మధ్యతరగతి మనుష్యులుగా తమ హోదా తమకు లేదూ?

అయినా, ఇంత కడుపు కట్టుకొని, కట్టుకోవడానికి సరైన గుడ్డల్లేకుండా దాచుకొని మాత్రం ప్రయోజన మేమిటి.!...



రామ్మూర్తికి కావలిసింది ఒక్కటే! బాంకులో పాస్ బుక్ నిండుగా డబ్బు ఉండాలి. ఆ పాస్ బుక్ ఎవరైనా తెరిచి చూస్తే—"అబ్బో! రామ్మూర్తిగారు బోలెడు డబ్బు కూడబెట్టారే!" అంటే చాలు, ఆ రోజు మరి అన్నం అక్కర లేదు. వేసే బియ్యంలో ఇంకో రెండు గుప్పెళ్ళు తీసేసి—"ఈ పూటకు ఇవి చాల్లే! నా కాకలిగా లేదు" అనే వాడు. భర్తకు ఇదేం పిచ్చో ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కాదు శ్యామలకు. పోనీ,ఆ డబ్బులో ఎవరైనా అవసరం పడి ఒక పదీ పరకా బాకీ—అదీ వడ్డీకే—ఇమ్మన్నా వాళ్ళ ప్రాణం పోతున్నా సరే ఇవ్వడు. అంతెందుకు? పిల్లాడికి ఒక సారి నిజంగానే ప్రాణం మీదికి వస్తే ఒక పైసా బాంకులోంచి తియ్య లేదు. పైగా, "ఆయుష్షు ఉంటే ఏ మందులూ మాకులూ లేకపోయినా వాడే బతుకుతాడు. ఆయుష్షు లేక పోయాక ఎన్ని డబ్బులు పోసి, ఎన్ని మంచి మందులు వాడినా బ్రతకడు. అంత దానికి ఎందుకు? నువ్వూరుకో!" అని కసిరేశాడు. చిత్రంగా బాబుకు అంతటి జ్వరం ఏ మందూ లేకుండానే (గవర్నమెంటు హాస్పిటల్ మందుతోనే) తగ్గిపోయింది. కానీ, ఆ రోజే భర్త విషయంగా శ్యామల మనసుకూడా విరిగిపోయింది. ఈ రోజు బాబే కాదు, పది వేల కట్నంతో, పది తులాల బంగారంతో వచ్చిన తన క్కూడా రేపు ఏమన్నా అయితే ఇదేగతి అని నిర్లిప్తంగా నవ్వుకుంది. ఆ రోజే భర్తను ఏదీ ఇది కావాలి అని అడగకూడ దనుకుంది. కానీ, ఈ రోజు ఈ సమస్య...ఎలా అడగాలి? తన కోసం కాదు; బాబు కోసం ఒక రెండు జతలు. ఒకటి స్కూలు డ్రెస్సు, ఒకటి మామూలు కలరు డ్రెస్సు. ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్ళడాని కోసం...అడగాలి. తప్పకుండా అడగాలి. దెబ్బలాడైనా సరే, బాబుకు బట్టలు కుట్టించాలి—అని తీర్మానించుకుంది.

కానీ, అంతటి తీర్మానం సాయంత్రం భర్త మొహం చూసేసరికి ఎగిరిపోయింది.

మామూలుగా భార్య ఇచ్చిన అతి పలచటి నీళ్ళ కాఫీ త్రాగి (అంతకంటే స్ట్రాంగ్‌గా త్రాగితే ఆరోగ్యం దెబ్బ తింటుందని లెక్చరిస్తాడు. కానీ, అదే ఎవరి ఇంట్లోనైనా ఇస్తే గుట్టుచప్పుడు కాకుండా హాపీగా త్రాగేస్తాడు.) అలా వాకింగ్ కని వూరిమీద పడేటప్పుడు అతి ప్రయత్నంమీద అడిగేసింది.

"ఈరోజు మీ జీతం వచ్చిందా?".

ఏదో వినకూడని విషయం భార్య నోటినుంచి వచ్చినట్లుగా, అదిరి పడ్డట్లుగా అసహనంగా, ఇంకా ఎలాగో ఎలాగో మొహాన్ని మార్చి చూశాడు—'ఆ విషయం నీకెందుకు?' అన్నట్లు.

అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లు—

"ఏం? ఇంట్లో సరుకులు అప్పుడే అయిపోయాయా?" అని అడిగాడు అసహనంగా.

"అబ్బే! అది కాదు." కంగారు పడిపోయింది శ్యామల.

వెచ్చాలు ముగ్గురు మనుషులకు ఏది ఎంత కావాలో అంచనావేసి నెలకు కావలసింది లెక్కగట్టి అన్ని ఒక్కసారే రెండు మూడు తేదీల్లోపల తెచ్చి భార్యకు అందిస్తాడు. మళ్ళీ ఆ తేదీలు వచ్చేలోగా 'ఇది అయిపోయింది' అని ఏనాడూ భార్య అడగ కూడదు. అలాగే జరిపేసుకోవాలి. చాలకపోతే అందులోనే సర్దుకుపోవాలి. అది అంతే! దానిపై తర్జన భర్జనలు జరపబడవు. పని మనిషికి, పాల మనిషికి, చాకలాడికి తన చేతుల మీదుగానే లెక్క గట్టి ఇస్తాడు. భార్య చేతిలో ఎర్రని ఏగాని ఎప్పుడూ వెయ్యడు. ఆ అవసరం రానివ్వడు. ఒకవేళ వచ్చినా వంద జాగ్రత్తలు చెప్పి ఎలా ఖర్చు పెట్టాలో, అందులో ఎంత పొదుపు చెయ్యాలో. అనవసరంగా దుబారా చెయ్యకూడదని చెప్పి మరీ ఇస్తాడు. అది అక్కడి కక్కడ సరిపోతే అదే పదివేలు అనుకుంటుంది శ్యామల.

"అయితే, మరింకేమిటీ?!"

శ్యామల తన ఆలోచనల్లో ఉండగానే చెప్పు లేసుకొని బయట కెళ్ళిపోయాడు రామ్మూర్తి.

ప్రొద్దుట్నుండీ ఎలా అడగాలో వేసుకున్న రిహార్సలంతా అలా తలక్రిందులయిపోవడంతో ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చేసింది శ్యామలకు.

బాబు స్కూలునుండి పరుగెత్తు కొచ్చేశాడు. వస్తూనే గట్టిగా చుట్టుకొని సంబరంగా అడిగాడు.

"అడిగావా?!...నాన్నగారు తెస్తానన్నారా?!"

శ్యామల జవాబు చెప్పలేదు.

మూతి బిగించేశాడు.

"నేను చెప్పలేదూ! నాన్నగారు నీ మాట



వినరనీ!'' అని రాగం తీశాడు.

''అబ్బ ! నేను అడగందే! ఏదో అర్జెంటు పనికి బయటి కెళ్ళారు. రాత్రికి అడుగుతానుగా!''

''నిజం !'' మళ్ళీ వాడి కళ్ళలో ఆశ.

''నిజంగానే !''

వాడి సాయంత్రపు టిఫిన్ కని నెలకు ఒకసారే బొరుగులు తెస్తాడు రామ్మూర్తి వాటిని ఎంత డబ్బాలో పోసి మూత పెట్టినా నెల మధ్యలో కొచ్చేసరికి మెత్తబడిపోతూ ఉంటాయి.

ఆ మెత్తబడ్డ బొరుగుల్నే తిని వాడు బయటికి పరిగెత్తాడు. మళ్ళీ వాణ్ణి వెనక్కు పిలిచి ఆ స్కూలు డ్రెస్సు విప్పేసి, కలరు డ్రెస్సు వేసింది. స్కూలు డ్రెస్సుకన్నా అది కాస్త మెరుగే. ఆర్నెల్ల క్రిందు తను పుట్టింటి కెళితే తమ్ముడు కుట్టించిన జత.

రామ్మూర్తి పీనాసితనానికి తోడు అనుమానం కూడా.

మళ్ళీ రాత్రి అడగాలి.

రాత్రి పడక దగ్గర తను ఏ విషయమ్మైనా అడిగితే దిగ్గున లేచి కూర్చుంటాడు రామ్మూర్తి.

''నువ్వు వెలయాలివా, నా ఇంటి ఇల్లాలివా?'' ఒకటే ఒక మాట.

దానితో సిగ్గుతో చితికిపోయి అక్కడి కక్కడే చచ్చిపోవాలనిపిస్తుంది. ఆ అనుభవం కూడా అయింది.

సరే ! భోంచేసేటప్పుడు అడగొచ్చులే, అనుకుంది మళ్ళీ.

రాత్రి భోజనం చేసేటప్పుడు ధైర్యంగానే అడిగింది.

''బాబు స్కూలు డ్రెస్సు మరీ చిరిగిపోయింది. వాడికి బట్టలు కుట్టించాలి'' అంది.

''ఇంటి విషయాలు నాకుమాత్రం తెలీదూ ! అయినా వేనే కుట్టిద్దాం అనుకుంటున్నాలే. రేపెలాగూ పండుగకదా. ఒకేసారి ఒక రెండు జతలు




అంటే, శ్యామల శీలంమీద అనుమానం లేదు. ఇంటి గుట్టు విషయాలు ఎక్కడ భార్య ఇతరులకు చెప్పేస్తుందోనని అనుమానం. ''అయినా, ఈ ఆడవాళ్ళకు ఇంకే విశేషాలు ఉండవు. మా ఇంట్లో ఇది అంటే, మా ఆయన ఇలా అంటే, వాళ్ళింట్లో అదీ, వాళ్ళాయన అలా అనే కబుర్లే!'' అంటూ విసుక్కుంటాడు కూడా. అందుకే ఎవరి ఇంటికీ భార్యను పంపించడు. ఎవళ్ళతోనూ భార్యను స్నేహం చెయ్యనివ్వడు. కానీ పుట్టింటికి పోతానంటే మాత్రం వద్దనడు. భార్యకు చీరో, కొడుక్కు గుడ్డలో వస్తాయి కాబట్టి. కానీ, శ్యామల తత్త్వం వేరు. ఎంత పుట్టింటివారైనా వాళ్ళు పెట్టినదాంట్లో తనూ కొద్దిగానైనా తిరిగి పెట్టగలిగితేనే మర్యాద అను కుంటుంది. అందుకోసం ఎప్పుడో గాని పుట్టింటికి వెళ్ళదు.

కుట్టించేస్తే...''

ఆశ్చర్యంగా తల ఎత్తింది శ్యామల.

''పండగా?!...రేపు...రేపంటే...''

దీపావళి మొన్ననే పోయినట్లు గుర్తు.

తను కొనివ్వకపోయినా వాళ్ళూ వీళ్ళూ కాల్చినవి గుడ్డల మీద పడి గుడ్డలు కాలిపోతాయని దీపావళికి కొత్త గుడ్డలు తియ్యడు. అసలు ఏ పండగకు తీస్తాడనీ? ... అల్లాంటిది మరే పండగ రేపు? ...

''అదే-రెణ్ణెల్ల తరవాత సంక్రాంతి వస్తుందిగా! ఒకటేసారి అప్పుడు కుట్టించేస్తానులే. నీకు చీర కూడా కొనాలనుకుంటున్నాను ఈ సారి.'' చాల ఉదారంగా అన్నాడు.

''రేపు! ... రేపంటే ఇంకో రెణ్ణెల్ల ... అప్పటి దాకా వాణ్ణి ఎలా సముదాయించాలి?'' ఆలోచనలో పడిపోయింది శ్యామల.

అన్నం తినేసి లేచి వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

శ్యామలకు అన్నం సహించలేదు.

మళ్ళీ రేప్పొద్దున్న బాబుకు ఏం చెప్పాలా అన్నదే సమస్య! ...

కానీ, తెల్లవారితే క్రొత్త సమస్య ఎదురవుతుందని అనుకోలేదు శ్యామల.

బజారు నుంచి తెచ్చిన రెండిడ్లీలను బుద్ధిగా తినేసి మారాం చెయ్యకుండా అదే డ్రెస్సు వేసు కున్నాడు బాబు. కానీ, వెళ్ళేటప్పుడు మాత్రం గారాలుపోతూ—''అమ్మా! నాకు పది పైసలు ఇవ్వవూ?'' అన్నాడు.

గుండె ఆగినంత పనయిపోయింది శ్యామలకు.

పిల్లలకు డబ్బు అలవాటు చెయ్యడం మహా నేరం అంటాడు రామ్మూర్తి.

'పిల్లలు ముప్పాతిక వంతు చెడిపోయేది డబ్బులు ఇవ్వడం వల్లనే!' అని వాదిస్తాడు కూడా.

అందులో నిజం ఉండచ్చు. కానీ, పిల్లలు అడ క్కుండానే వాళ్ళ అవసరాలు తీరిస్తే వాళ్ళకు డబ్బు అవసరం తెలీదు కదా! అనుకుంటుంది శ్యామల. కానీ, బయటికి మాత్రం అనదు. అన్నా ప్రయోజనం ఉండదని తెలుసు.

''ఎందుకురా?'' అని శ్యామల అడక్కుండానే బాబు చెప్పాడు.

''స్కూల్లో విజయ, రామూ వాళ్ళందరూ చాకలెట్లు కొనుక్కుంటారు. మరి వాళ్ళు తింటూ ఉంటే నేను పూరికే చూడాల్నా ఏమిటే? ... నేనూ కొనుక్కుంటే వాళ్ళతోబాటు ఎం చక్కా చప్పరిస్తూ తినొచ్చు కదా! ఇవ్వవూ!''

జవాబు చెప్పలేకపోతూంది శ్యామల.

తను కడు పేదది కాదు—కొడుకు పది పైసలు ఇవ్వమంటే 'లేదురా, చిట్టితండ్రీ!' అని దీనంగా మొహం పెట్టుకొని ఏడ్వడానికి. కానీ, తన దగ్గర ఆ పది పైసలూ లేవు, మరి.

అతి కష్టం మీద రేపిస్తానని బుజ్జగించి పంపిం చేసింది బాబుని. కానీ ఎన్నాళ్ళు అలా బుజ్జగించ గలదు?...చివరికి సహనం చచ్చి ఒక రోజు—''వెధవా! నీకు డబ్బులు కావాలా?! ... ఇంకోసారి అడుగుతావా? అడుగుతావా?!'' అని బుల్లి చేతులు వాతలు తేలేట్టు కొట్టింది కూడా.

వాణ్ణి కొట్టినందుకు ఆ రోజు రాత్రంతా ఏడ్చింది.

మరుసటి రోజు జన్మలో తను ఎప్పుడూ చెయ్యని పని ... చెయ్యకూడని పని...ఎవరైనా చేసివారంటే మందలించాల్సిన తను ... భర్త లెట్రిన్ కెళ్ళితే అతని జేబులోంచి ఒక పావలా కాసు దొంగతనం చేసింది.

బాబు స్కూలు కెళుతూంటే దాన్ని భద్రంగా దాచి ఇచ్చింది ఇష్టం వచ్చింది కొనుక్కుతినమని. చివరికి నాన్నకు తెలియువద్దని గట్టిగా చెప్పింది కూడా.

బాబు ఎర్రగా వాతలు తేలిన చేతులతోనే ఆ పావలాను తీసుకున్నాడు. కానీ, ఆ తరవాత మరి తల్లిని ఎప్పుడూ డబ్బు ఇవ్వమని అడగలేదు.

ఆ సాయంత్రం మాయమ్మైన పావలా గురించి తండ్రి తల్లిని లక్ష ప్రశ్నలు అడుగుతుంటే, తల్లి దగ్గరికి ఆ పావలా ఎలా వచ్చిందో చూచాయగా

గ్రహించుకుంది బాబు మనసు.

ఆ తరవాత అడపా దడపా రామ్మూర్తి జేబులోంచి పావలా, అర్ధా అంతర్ధాన మవుతుండేది.

కేర్‌ఫుల్‌గా కాపలా కాసిన రామ్మూర్తి ఒక రోజు బాబును రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాడు.

అలాంటి నీచమయిన పని చేసినందుకు చింత బరికెతో ఒళ్ళు తేలిపోయేట్లు కొడుకును కొడుతుంటే, ఆ పరిస్థితికి నాంది పలికిన శ్యామల విలవిల్లాడి పోయింది.

కొడుకును అదిమి పట్టుకొని పడుకొని ఏడుస్తూ ఉండిపోయింది ఆ రాత్రి.

బాబుమాత్రం ఏడ్వలేదు. చిన్న మెదడుతో తీవ్రంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

తన తోటి పిల్లలందరూ డబ్బులు పెట్టి అన్నీ కొనుక్కో గలుగుతున్నారు. చివరికి రోడ్డుమీద పెన్నం పెట్టి అట్లు పోసే అచ్చమ్మ కూతురు కూడా రోజూ ఇరవై పైసలు పెట్టి బిళ్ళలూ, మిఠాయిలూ కొంటూనే ఉంది. ఇంకా కొంతమంది పిల్లల దగ్గర డబ్బు లేకపోయినా చాకలెట్లు, బిస్కట్లు ఉంటాయి. అడిగితే వాళ్ళ నాన్నగారు బోలెడన్ని తెస్తారని చెపుతారు. మరి, మా నాన్నగారు ఎందుకు తెవ్వరు? ... ఏమైనా, ఎట్లయినా తనే డబ్బులు సంపాదించుకోవాలి. ఎలా? ఎలా? పదేళ్ళ బాబు తీవ్రంగా ఆలోచిస్తూనే పడుకున్నాడు.

పండగ వచ్చిందీ, పోయిందీ. కాని,బాబుకు క్రొత్త బట్టలు మాత్రం రాలేదు. జేబులోంచి దొంగతనం చేసినందుకు శిక్షగా పండగకు బట్టలు కొనివ్వలేదు రామ్మూర్తి.

శ్యామల ఏదో చెప్పబోతే—"అలా చేస్తేనే ఆ దొంగ వెధవకు బుద్ధొచ్చి ఇంకోసారి అలా చెయ్యడు" అని చెప్పాడు.

మవునంగా ఉండిపోయింది శ్యామల, అంతకంటే ఇంకేం చెయ్యాలో తెలియక.

ఇంకో రెండు నెలలు గడిచిపోయాయి.

"రాస్కెల్! దొంగ వెధవ!" అంటూ అగ్గిమీద గుగ్గిలంగా ఎగిరెగిరి పడుతూ ఇంటికి వచ్చాడు రామ్మూర్తి.

"ఎవరు?... ఏమిటే?" అంటూ ఆదుర్దాగా ఎదురు వచ్చింది శ్యామల.

"ఇంకెవరు? నీ సుపుత్రుడే!... స్కూల్లో ఎవరిదో పెన్ను తీసేశాడట. వాళ్ళ హెడ్మాస్టరు పిలిచి నన్ను చీవాట్లేశాడు. పరువు తీస్తున్నాడు వెధవ! ఇంటికి రానీ వాడు..." అంటూ ఇంకా ఏదేదో అరుస్తూనే ఉన్నాడు.

చప్పున నాల్రోజుల క్రితం బాబు అడిగిన సంగతి గుర్తొచ్చింది.


"అమ్మా! మా టీచర్ పెన్ను కొనుక్కోమంది."

"నాన్నను అడగరాదురా! నన్నడిగితే ఎలా?"

"నాన్న అరుస్తాడు."

"ఛ! పెన్నడిగితే ఏం అరవరు. చదువుకోడానికే కదా. వెళ్ళు! వెళ్ళి అడుగు."

బాబు కాస్త జంకుతూనే ముందు గదిలో ఉన్న తండ్రిని అడిగాడు.




"నాన్నా! మా టీచర్ పెన్ను కొనుక్కోమంది."

పేపర్లోంచి తలెత్తి చిత్రంగా చూశాడు రామ్మూర్తి.

"పెన్నా! ఇప్పుడే ఎందుకురా?... నాలుగు రోజుల కోసారి ఒక పెన్సిలు పోగొట్టేస్తున్నావు. దానికే భరించలేకుండా ఉన్నాను. ఇంకా రూపాయలు రూపాయలు పెట్టి పెన్నులు కూడా పోగొట్టాలనా?!... ఇంక సంసారాలు చేసినట్లే. చదువులు చదివినట్లే! ఇంతోటి చదువుకు పెన్నేం అక్కరలేదు గాని, వెళ్ళి ఆ పెన్సిలుతోనే వ్రాసుకో. ఫో!" కసిరేశాడు రామ్మూర్తి.

బాబు బిక్కచచ్చిపోయాడు.

"అందుకోసమే ... అందుకోసమే ఈ నాన్నను ఏం అడగాలన్నా ఇష్టం ఉండదు." కసిగా మనసులో అనుకున్నాడు.


కళ్ళలో నీళ్ళు ఉబికి ఉబికి వస్తుంటే మవునంగా వచ్చి పుస్తకం పట్టుకొని కూర్చున్నాడు. కళ్ళు చూస్తున్నాయే గానీ, ఒక్క ముక్క చదవడం లేదని వంటింట్లోంచి ఇదంతా గమనించిన శ్యామలకు తెలుసు. కానీ, "చదవరా!" అని మందలించ లేకపోయింది ఎందుకో.

అయితే, ఆ రోజు పెన్ను కొనివ్వలేదని ఈ రోజు ఇలా చేస్తాడా?... బాబు చేసిన పని తప్పో, ఒప్పో శ్యామల మనసు బేరీజు వేసుకోలేకపోతూంది.

చివరికి ఏమయినా బాబు చేసిన పని తప్పేనని నిర్ధారించుకుంది..

నిజంగానే ఎంత పరువు చేటు! ఫలానా వారి అబ్బాయి ఇలా అని తెలిస్తే !... ఆ తల్లి ఎలా పెంచిందో అని అనరూ?... ఆ ఆలోచన వచ్చిందే తడవుగా రక్తం ఉడికి పోయింది శ్యామలకు.

సాయంత్రం బాబు వచ్చాక రామ్మూర్తి బెల్టు



తీసుకొని కింద పడేసి—"చేస్తావా? చేస్తావా?" అంటూ చచ్చేట్లు కొట్టాడు.

శ్యామల తల్లి హృదయం ఎంత ఏడుస్తున్నా అన్నం పెట్టలేదు.

ఇంత చేసినా నొప్పికి తాళలేక ఒకటి రెండు సార్లు గట్టిగా కేకలు పెట్టాడే గాని, ఆ తరవాత మళ్ళీ ఏడవలేదు బాబు. కానీ, ఆ రోజు తరవాత బాబు ప్రవర్తనలో శ్యామలకు ఒకలాంటి నిర్లక్ష్యం కనిపించేది.

బాబు ఎలా తయారవుతాడో అని ఒక విధమైన భయం కూడా పట్టుకుంది.

ఆ తరవాత కూడా బాబు నాలుగు రోజుల కొకసారి ఏదో ఒకదానికి రామ్మూర్తి చేతిలో దెబ్బలు తినేవాడు.

రాను రాను రామ్మూర్తి అలా కొట్టడం, బాబు వాటిని నిర్లక్ష్యంగా, మవునంగా భరించడం భరించ లేక పోయింది శ్యామల.

బాబు ప్రవర్తన వల్ల ఇంట్లో వాతావరణం కూడా భారంగా మారిపోయింది. శ్యామల మొహంలో సంతోషపు చాయలు కరవయి పోయాయి. రామ్మూర్తి ఎందుకో మరీ కఠినంగా తయారవుతున్నాడు. ఇంట్లో ఉన్న ముగ్గురి మధ్య మాటలు కరవయిపోయాయి.

ఒకరోజు ఇంక సహించలేక రామ్మూర్తి లేని సమయం చూసి బాబు ముందు ఏడ్చేసింది శ్యామల. కనీసం తన కన్నీళ్ళయినా చూసి బాబు తన ప్రవర్తన మానుకుంటాడేమోనని ఆశించింది ఆ తల్లి హృదయం.

ముందు తల్లిని విచిత్రంగా చూశాడు బాబు.

తరవాత మవునంగా ఉండిపోయాడు.

"ఎందుకురా ఇలాంటి పనులు చేస్తావు?... చక్కగా చదువుకుంటూ నువ్వు మంచిగా ఉంటే ఎంత సంతోషంగా ఉంటుందో నీకు తెలియదూ?"

బాబు మవునం.

"కనీసం నా కోసం... నా కోసమయినా ఇలాంటి పనులు మానుకోరా!" ప్రేమగా వాడి తల నిమురుతూ అడిగింది శ్యామల.

"అలాగే. కానీ, మరి నాకు కావాల్సినవి అన్నీ నువ్వు తెచ్చిస్తూ ఉంటావా?"

ఆవాక్కయిపోయింది శ్యామల.

"ఏమిటి?... ఏం కావాలి?"

"ఏవయినా! మా ఫ్రెండ్సందరూ ఏం కొనుక్కుంటే అవి." అంతకంటే విడమరిచి ఎలా చెప్పాలో వాడి చిన్న బుర్రకు తెలియ లేదు.

"నువ్వడిగితే నాన్న కొనిస్తారుగా," గొంతు లోంచి ఆ మాటల్ని రప్పించటానికి చాలా కష్ట పడింది శ్యామల.

మరి మాట్లాడలేదు బాబు. కానీ, కళ్ళెత్తి తల్లి కళ్ళలోకి లోతుగా చూశాడు.

"నన్ను నమ్మమంటావా?" అన్నట్లున్నాయి ఆ చూపులు.

బాబు అలా చూశాడో లేదో కానీ, శ్యామలకు మాత్రం బాబు చూపుల్లో చెప్పలేనంత హేళన



స్పష్టంగా కనిపించినట్లయింది.

రోజులు గడిచి పోతున్నాయి అలాగే. స్కూలు నుంచి కంప్లెయింట్స్ రావడం కొద్దిగా తగ్గినట్లనిపించింది.

కానీ, ఒక రోజు ఇంటి ముందు ఒక పోలీసు తచ్చాడుతుంటే ఎవరి కోసమో నంటూ బయటకు వచ్చింది.

"రామ్మూర్తి గారున్నారమ్మా!" అన్న మాటలతో లోపలున్న రామ్మూర్తి కూడా బయటకు వచ్చాడు.

ఇద్దరి కళ్ళకు ఒకేసారి పోలీసు వాడి వెనక తల దించుకుని నిలబడ్డ బాబు కనిపించాడు.

రామ్మూర్తి రౌద్రాకారం దాల్చబోతుంటే పోలీసు అతి శాంతంగా చెప్పాడు.

ఎక్కడో దొంగతనం చేస్తుంటే ఆ గూండాల వెనక బాబుకూడా ఉన్నాడు. ఆ గూండాలు తప్పించు కున్నారు. బాబు చిన్న వాడు కాబట్టి దొరికిపోయాడు. ఇన్‌స్పెక్టరు బాబు అమాయకత్వాన్ని, పసితనాన్ని చూసి మొదటి తప్పుగా భావించి వదిలేశాడు. కానీ, ఇంకోసారి ఇలాంటి పరిస్థితి వస్తే మాత్రం తనేం చెయ్యలేనని చెప్పమన్నాడు. జాగ్రత్తగా తలి దండ్రులకు అప్పగించి ఇంకోసారి ఇలా జరగకుండా ఉండేటట్లు చూడమని చెప్పి రమ్మన్నాడట పోలీసుతో.

వింటున్న శ్యామలకు కాళ్ళ కింద భూమి కదిలి పోతున్నట్లుగా అనిపించింది. కళ్ళ ముందు బాబు బాలనేరస్థుడుగా చేతులకు బేడీలతో, ఆ తరవాత పెద్ద గజదొంగలా...ఇంకా ఇంకా ఎలాగో కనిపించాడు. బాబు ఇలా ఇలా తయారు కావలసిందేనా? తను తల్లిగా ఏం చెయ్యలేదా? రామ్మూర్తికి కొట్టడం, తిట్టడంతప్పఇంకేం చేతకాదు.కానీ...తను?తనుకూడా అలాగే ఉండి పోవాలా? బాబుని మార్చలేదా తను?

జిల్లి బిల్లిగా దిక్కు తోచనట్లు సాగుతున్న ఆలోచనలు ఒక్కసారిగా బ్రేకు పడ్డట్టు ఆగి పోయాయి—బాబు హృదయ విదారకంగా పెట్టిన "అమ్మా!" అనే కేకతో.

పోలీసు ఎప్పుడో వెళ్ళిపోయాడు.

రామ్మూర్తి మూలనున్న గొడుగు తీసుకుని, దాని ఇనుప పిడికిలితో బాబును ఎక్కడ పడితే అక్కడే బలం కొద్దీ కొడుతున్నాడు.

ఏదో ఆవేశం వచ్చిన దానిలా పరిగెత్తుకెళ్ళి బాబుకు అడ్డుగా నిలిచింది.

"ఇంకో దెబ్బ వాడి ఒంటి మీద పడితే ఇక పూరుకోను, పూనకం వచ్చిన దానిలా గట్టిగాఅరిచింది.

ఎప్పుడూ అతి శాంతంగా ఉండే భార్యకు అంత కోపం వచ్చేసరికి క్షణం ఆశ్చర్యపోయినా, అంతకంటే కోపంగా అరిచాడు రామ్మూర్తి.

"వాడు చచ్చిపోయినా ఫరవాలేదు. ఇంకోసారి వాడిలా నా పరువు తీస్తే మాత్రం నేను పూరుకోను. నువ్వు జరుగు. వాణ్ణి చంపితే గానీ వాడు దారికి రాడు."

"హుఁ. చంపేస్తారు. చంపెయ్యరూ మరి. వాడి అవసరాలు తీర్చలేని మీకు వాణ్ణి శిక్షించే హక్కుకూడా లేదు. ఈ రోజు నుంచి వాడి మీద మీకు ఎటువంటి అధికారం లేదు" అంటూనే చటుక్కున బాబు చెయ్యి పట్టి లేవదీసింది. ఉన్నపళాన ఒక సంచీలో రెండు బట్టలు కుక్కుకొని, బాబు చెయ్యి పట్టుకొని వెళుతున్నానని కూడా చెప్పకుండా బస్సు స్టాండు వైపు దారి తీసింది. ఆ క్షణం తను చేస్తున్న పని సబబో, కాదో అన్న ఆలోచన రాలేదు. బాబు భవిష్యత్తే పెద్ద రాకాసిలా మారి కళ్ళముందు భయపెట్ట సాగింది.

క్షణంలో జరిగి పోయిన సంఘటనకు రాయిలా బిగుసుకు పోయాడు రామ్మూర్తి.

శ్యామల వెళ్ళిన నాలుగో రోజు రామ్మూర్తికి ఉత్తరం వచ్చింది.

పైన సంబోధన లేదు.

"నేనుచేసిన పని మంచిదో,కాదో నాకు తెలియదు. ఈ విషయంగా సంఘం, లోకం ఏమనుకున్నా నాకు అవసరం లేదు. మీ హద్దులు మీరిన లోభత్వపు నీడలో బాబు భవిష్యత్తు పాడైపోవడం తల్లిగా నేను సహించలేను. మీ నుంచి నాకు ఏం అక్కర లేదు. కానీ, కట్టుకున్నందుకు నా కోసం, కన్నందుకు బాబు కోసం నెలకు ఎంత అవుతుందో లెక్క కట్టి నెలకు ఇంత అని పంపిస్తే నేను సంతోషిస్తాను. కనీసం ఇది మీ బాధ్యతగానయినా గుర్తిస్తా రని అనుకుంటాను. నా పి. యు. సి. చదువుకు తమ్ముడి ఇన్‌ఫ్లూయన్సు వల్ల ఇక్కడ కాన్వెంట్‌లో టీచర్‌గా జాబ్ దొరికింది. బాబును అదే స్కూల్లో వేశాను. అనుక్షణం వాడి వెనకే ఉండి వంద కళ్ళతో వాణ్ణి కనిపెట్టగలిగే అవకాశం దేవుడు ఇచ్చి నందుకు ఎంతో సంతోషంగా ఉంది. నాకు ఈ జీవితంలో కావలసింది బాబు...బాబు భవిష్యత్తు తప్ప ఇంకేం అక్కర లేదు. నన్ను అర్థం చేసుకుని వాడి విషయంలో మీ 'బాధ్యత' తీర్చుకుంటా రని ఆశిస్తూ...

—శ్యామల."

నాలుగు వాక్యాలే అయినా, ఆ ఉత్తరం చదివాక రామ్మూర్తిలో తెలియని అలజడి రేగింది.

ఆ అలజడిలో సముద్ర తరంగాల్లా ఆలోచనలు రేకెత్తాయి. ఆ ఆలోచనల మధ్య ఒకటే ఒక ప్రశ్న.

తను ఇంత కష్టపడి కూడబెట్టేది ఎవరి కోసం? ఎవరి కోసం? ★